క్రీడాభిమానులంతా కండ్లు కాయలు కాచేలా వేచి చూస్తున్న వన్డే విశ్వ సమరానికి రంగం సిద్ధమైంది. నేటి నుంచి నెలన్నర రోజుల పాటు ఫ్యాన్స్‌ను సిక్సర్ల సునామీ, వికెట్ల జడివానలో ముంచెత్తేందుకు అన్నీ జట్లు అస్త్రశస్త్రాలతో సన్నద్ధమయ్యాయి. తొలిసారి భారత్ ఒంటరిగా ఆతిథ్యమిస్తున్న మెగాటోర్నీకి నేడు అహ్మదాబాద్‌లో తెరలేవనుంది. గత వరల్డ్‌కప్ ఫైనలిస్టులు న్యూజిలాండ్, ఇంగ్లండ్ మధ్య ఆరంభ పోరు కోసం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

క్రికెట్‌ను మతంగా భావించే మన దేశంలో వన్డే వరల్డ్‌కప్ జరుగుతుండటంతో.. భారత్‌పై భారీ అంచనాలు నెలకొనగా.. 10 జట్లు.. 10 వేదికలు.. 45 రోజులు.. 48 మ్యాచ్‌లు.. 6 డబుల్ హెడర్స్‌తో ప్రపంచకప్ అగ్గి రాజేస్తున్నది. పసలేని మ్యాచ్‌లకు, బోరింగ్ సమరాలకు స్వస్తి పలుకుతూ..ఐసీసీ ర్యాంకింగ్స్ అగ్రస్థానంలో ఉన్న ఎనిమిది జట్లను మెగాటోర్నీకి నేరుగా ఎంపిక చేయగా.. శ్రీలంక, నెదర్లాండ్స్ క్వాలిఫయింగ్ టోర్నీలో సత్తాచాటి ముందంజ వేశాయి.మరింకెందుకు ఆలస్యం.. వన్డే మజాను ఆస్వాదించేందుకు మీరూ సిద్ధమైపోండి!



# విశ్వ సమరం

## నేటి నుంచి వన్డే వరల్డ్‌కప్

ఆరంభ వేడుకలు లేకుండానే మెగాటోర్నీ

తొలి పోరులో కివీస్‌తో ఇంగ్లండ్ ఢీ

మధ్యాహ్నం 2 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

అహ్మదాబాద్: నాలుగేండ్లకోసారి నిర్వహించే ఐసీసీ ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌నకు వేళైంది. సాధారణంగా వేసవిలో జరిగే ఈ టోర్నీ ఈసారి శీతాకాలంలో వేడి పుట్టించేందుకు సిద్ధమైంది. టీ20ల ప్రభావంతో వన్డేలకు కాలం చెల్లిపోయిందనే వాదనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ మెగాటోర్నీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే మూడుసార్లు (1987, 1996, 2011) సహచర దేశాలతో కలిసి వరల్డ్‌కప్‌నకు ఆతిథ్యమిచ్చిన భారత్ ఈ సారి ఒంటరిగా మెగాటోర్నీ నిర్వహిస్తున్నది. ఆతిథ్య భారత్‌తో పాటు, అఫ్గానిస్థాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు ప్రపంచకప్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. ఇందులో గతంలో ఐదు జట్లు (ఆస్ట్రేలియా 5 సార్లు, భారత్ రెండుసార్లు, ఇంగ్లండ్, పాకిస్థాన్, శ్రీలంక ఒక్కోసారి) ట్రోఫీని ముద్దాడగా.. మిగిలిన ఐదు జట్లు ఇప్పటి వరకు ప్రపంచ చాంపియన్ హోదా దక్కించుకోలేకపోయాయి. మెగాటోర్నీకి ముందు ఆరంభ వేడుకలు నిర్వహించకూడదని ఐసీసీ నిర్ణయించగా.. బుధవారమే వరల్డ్‌కప్ సారథులతో 'కెప్టెన్స్ మీట్' జరిగింది. రౌండ్ రాబిన్ లీగ్ విధానంలో జరగనున్న ఈ టోర్నీలో లీగ్ దశలో మెరుగైన ప్రదర్శన చేసిన నాలుగు జట్లు సెమీఫైనల్‌కు చేరనున్నాయి. మెగాటోర్నీలో ఆదివారం చెన్నైలో ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా తమ తొలి మ్యాచ్ ఆడనుంది. 2011లో స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో విజేతలుగా నిలిచిన టీమ్ నుంచి ప్రస్తుత భారత జట్టులో కోహ్లీ, అశ్విన్ మాత్రమే ఉండగా.. గత వరల్డ్‌కప్‌లో ఐదు శతకాలతో అదరగొట్టిన రోహిత్ శర్మ మరోసారి సేమ్ సీన్ రిపీట్ చేసేందుకు రెడీ అవుతున్నాడు.

### వన్డే ప్రపంచకప్ షెడ్యూల్-2023

| తేదీ | మ్యాచ్ | వేదిక | సమయం |
|---|---|---|---|
| అక్టోబర్ 5 | ఇంగ్లండ్ x న్యూజిలాండ్ | అహ్మదాబాద్ | మ. 2.00 |
| 6 | పాకిస్థాన్ x నెదర్లాండ్స్ | హైదరాబాద్ | మ. 2.00 |
| 7 | బంగ్లాదేశ్ x అఫ్గానిస్థాన్ | ధర్మశాల | ఉ. 10.30 |
| | దక్షిణాఫ్రికా x శ్రీలంక | ఢిల్లీ | మ. 2.00 |
| 8 | భారత్ x ఆస్ట్రేలియా | చెన్నై | మ. 2.00 |
| 9 | న్యూజిలాండ్ xనెదర్లాండ్స్ | హైదరాబాద్ | మ. 2.00 |
| 10 | ఇంగ్లండ్ x బంగ్లాదేశ్ | ధర్మశాల | ఉ. 10.30 |
| | పాకిస్థాన్ x శ్రీలంక | హైదరాబాద్ | మ. 2.00 |
| 11 | భారత్ x అఫ్గానిస్థాన్ | ఢిల్లీ | మ. 2.00 |
| 12 | ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా | లక్నో | మ. 2.00 |
| 13 | న్యూజిలాండ్ x బంగ్లాదేశ్ | చెన్నై | మ. 2.00 |
| 14 | భారత్ x పాకిస్థాన్ | అహ్మదాబాద్ | మ. 2.00 |
| 15 | ఇంగ్లండ్ x అఫ్గానిస్థాన్ | ఢిల్లీ | మ. 2.00 |
| 16 | ఆస్ట్రేలియా x శ్రీలంక | లక్నో | మ. 2.00 |
| 17 | దక్షిణాఫ్రికా x నెదర్లాండ్స్ | ధర్మశాల | మ. 2.00 |
| 18 | న్యూజిలాండ్xఅఫ్గానిస్థాన్ | చెన్నై | మ. 2.00 |
| 19 | భారత్ x బంగ్లాదేశ్ | పుణె | మ. 2.00 |
| 20 | ఆస్ట్రేలియా x పాకిస్థాన్ | బెంగళూరు | మ. 2.00 |
| 21 | నెదర్లాండ్స్ x శ్రీలంక | లక్నో | ఉ.10.30 |
| | ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా | ముంబై | మ. 2.00 |
| 22 | భారత్ x న్యూజిలాండ్ | ధర్మశాల | మ.2.00 |
| 23 | పాకిస్థాన్ x అఫ్గానిస్థాన్ | చెన్నై | మ. 2.00 |
| 24 | దక్షిణాఫ్రికా x బంగ్లాదేశ్ | ముంబై | మ. 2.00 |
| 25 | ఆస్ట్రేలియా x నెదర్లాండ్స్ | ఢిల్లీ | మ. 2.00 |
| 26 | ఇంగ్లండ్ x శ్రీలంక | బెంగళూరు | మ. 2.00 |
| 27 | పాకిస్థాన్ x దక్షిణాఫ్రికా | చెన్నై | మ. 2.00 |
| 28 | ఆస్ట్రేలియా x న్యూజిలాండ్ | ధర్మశాల | ఉ. 10.30 |
| | నెదర్లాండ్స్ x బంగ్లాదేశ్ | కోల్‌కతా | మ. 2.00 |
| 29 | భారత్ x ఇంగ్లండ్ | లక్నో | మ. 2.00 |
| 30 | అఫ్గానిస్థాన్ x శ్రీలంక | పుణె | మ. 2.00 |
| 31 | పాకిస్థాన్ x బంగ్లాదేశ్ | కోల్‌కతా | మ. 2.00 |
| నవంబర్1 | న్యూజిలాండ్xదక్షిణాఫ్రికా | పుణె | మ. 2.00 |
| 2 | భారత్ x శ్రీలంక | ముంబై | మ. 2.00 |
| 3 | నెదర్లాండ్స్ x అఫ్గానిస్థాన్ | లక్నో | మ. 2.00 |
| 4 | న్యూజిలాండ్ x పాకిస్థాన్ | బెంగళూరు | ఉ. 10.30 |
| | ఇంగ్లండ్ x ఆస్ట్రేలియా | అహ్మదాబాద్ | మ. 2.00 |
| 5 | భారత్ x దక్షిణాఫ్రికా | కోల్‌కతా | మ. 2.00 |
| 6 | బంగ్లాదేశ్ x శ్రీలంక | ఢిల్లీ | మ. 2.00 |
| 7 | ఆస్ట్రేలియా x అఫ్గానిస్థాన్ | ముంబై | మ. 2.00 |
| 8 | ఇంగ్లండ్ x నెదర్లాండ్స్ | పుణె | మ. 2.00 |
| 9 | న్యూజిలాండ్ x శ్రీలంక | బెంగళూరు | మ. 2.00 |
| 10 | దక్షిణాఫ్రికా x అఫ్గానిస్థాన్ | అహ్మదాబాద్ | మ. 2.00 |
| 11 | ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్ | పుణె | ఉ. 10.30 |
| | ఇంగ్లండ్ x పాకిస్థాన్ | కోల్‌కతా | మ. 2.00 |
| 12 | భారత్xనెదర్లాండ్స్ | బెంగళూరు | మ. 2.00 |
| నవంబర్15 | తొలి సెమీఫైనల్ | ముంబై | మ. 2.00 |
| 16 | రెండో సెమీఫైనల్ | కోల్‌కతా | మ. 2.00 |
| 19 | ఫైనల్ | అహ్మదాబాద్ | మ. 2.00 |

## న్యూజిలాండ్ X ఇంగ్లండ్

తీవ్ర ఉత్కంఠ మధ్య సాగిన 2019 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్‌పై బౌండ్రీల లెక్క ఆధారంగా విజయం సాధించి తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడిన డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్.. ఈ సారి తొలి మ్యాచ్‌లో కివీస్‌నే ఎదుర్కోనుంది. ఇరు జట్ల మధ్య అప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం మూడు వన్డేలు మాత్రమే జరగగా.. ఆ పరాజయానికి బదులు తీర్చుకోవాలని న్యూజిలాండ్ బలంగా కోరుకుంటున్నది. అయితే ఇరు జట్లను గాయాల బెడద వెంటాడుతున్నది. గత ఎడిషన్‌లో వీరోచితంగా పోరాడి జట్టుకు వన్డే ప్రపంచకప్ అందించిన స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ తొలి పోరులో ఆడటం అనుమానమే అని ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ పేర్కొనగా.. కివీస్ రెగ్యులర్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. సంప్రదాయ ఆటతీరుకు టాటా చెప్పి దంచికొట్టడమే పరమావధిగా చెలరేగిపోతున్న ఇంగ్లండ్ అదే జోష్ కొనసాగించాలని చూస్తుంటే.. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో అదరగొట్టిన న్యూజిలాండ్ తమకు అలవాటైన రీతిలో సైలెంట్‌గా పని ముగించాలని భావిస్తున్నది. పిచ్ అటు బౌలర్లకు, ఇటు బ్యాటర్లకు సమానంగా సహకరించనుండగా.. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు. స్టోక్స్ లేకపోయినా ఇంగ్లండ్ జట్టులో హిట్టర్లకు కొదవేలేదు. బెయిర్‌స్టో, మలన్, రూట్, బ్రూక్, బట్లర్, లివింగ్‌స్టోన్, సామ్ కరన్, క్రిస్ వోక్స్ ఇలా ఒకటి నుంచి ఎనిమిదో స్థానం వరకు ప్రతి ఒక్కరు విధ్వంసక వీరులే కాగా.. బౌలింగ్‌లో మార్క్‌వుడ్, ఆదిల్ రషీద్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక న్యూజిలాండ్ విషయానికి వస్తే కేన్ మామ గైర్హాజరీలో జట్టుకు వికెట్ కీపర్ టామ్ లాథమ్ సారథ్యం వహించనుండగా.. యాంగ్, కాన్వే, డారిల్ మిషెల్, గ్లెన్ ఫిలిప్స్, నీషమ్ బ్యాటింగ్ భారం మోయనున్నారు. ప్రధాన పేసర్ ట్రెంట్ బౌల్ట్‌తో పాటు ఫెర్గూసన్, సోధి, శాంట్నర్‌తో ప్రత్యర్థులకు ముప్పు తప్పకపోవచ్చు. కాన్వేపై టీమ్ మేనేజ్‌మెంట్ ఆశలు పెట్టుకోగా.. ఈ యువ ఆటగాడు ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది ఆసక్తికరం.

### వీళ్లకిదే చివరి చాన్స్!

ఈ తరం దిగ్గజాలుగా గుర్తింపు తెచ్చుకున్న పలువురు స్టార్ క్రికెటర్లకు దాదాపు ఇదే చివరి వన్డే వరల్డ్‌కప్ కానుంది. టీమ్‌ఇండియా నుంచి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. ఆసీస్ నుంచి స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్.. ఇంగ్లండ్ నుంచి జో రూట్, జోస్ బట్లర్.. న్యూజిలాండ్ నుంచి కేన్ విలియమ్సన్, టిమ్ సౌథీ.. దక్షిణాఫ్రికా నుంచి డేవిడ్ మిల్లర్, క్వింటన్ డికాక్.. బంగ్లాదేశ్ నుంచి షకీబ్ అల్ హసన్, ముష్ఫికర్ రహీమ్ మరో నాలుగేండ్ల తర్వాత జరిగే మెగాటోర్నీలో బరిలోకి దిగడం దాదాపు అసాధ్యమే. ఇదే చివరి మెగాటోర్నీ కావడంతో ఎలాగైనా సత్తాచాటి విశ్వ విజేతలుగా నిలువాలని వీళ్లంతా కృతనిశ్చయంతో ఉన్నారు.

**1**

భారత్ ఒంటరిగా వన్డే వరల్డ్‌కప్‌నకు ఆతిథ్యమివ్వడం ఇదే తొలిసారి. 1987లో భారత్, పాకిస్థాన్ ఉమ్మడిగా వరల్డ్‌కప్ నిర్వహించగా.. 1996లో ఈ జాబితాలో శ్రీలంక కూడా చేరింది. ఇక 2011లో భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ సంయుక్తంగా ప్రపంచకప్‌నకు ఆతిథ్యమిచ్చాయి.

**13**

వన్డే ప్రపంచకప్ చరిత్రలో ఇది 13వ మెగాటోర్నీ.



వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రంలో బుధవారం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి, సాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్. దేశంలోనే ఇది తొలి భారీ యువజన పథకమని సాట్స్ చైర్మన్ అన్నారు

11వ రోజు 12 పతకాలు

# పతక నీరాజనం

## ఆసియాడ్‌లో భారత్ అత్యుత్తమ ప్రదర్శన

## నీరజ్‌చోప్రా, జ్యోతిసురేఖ, రిలే టీమ్ పసిడి కాంతులు

**ప్రతిష్ఠాత్మక ఆసియాగేమ్స్‌లో భారత పతక జోరు టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నది. 'ఇస్ బార్ సౌ పార్' అన్న నినాదాన్ని చేతల్లో చూపెట్టేందుకు అథ్లెట్లు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఆర్చరీ కాంపౌండ్ ఈవెంట్‌లో తెలుగు ఆర్చర్ జ్యోతిసురేఖ, ఓజాస్ దేవ్‌తలె జోడీతో మొదలైన పసిడి జోరు నీరజ్ చోప్రా అద్భుత ప్రదర్శనతో పదకొండో రోజు ఘనంగా ముగిసింది. మొత్తం 12 పతకాలు ఖాతాలో వేసుకున్న భారత్..సుదీర్ఘ ఆసియాగేమ్స్ చరిత్రలో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. పురుషుల రిలే టీమ్‌ఈవెంట్‌లో భారత్ తమ టైటిల్‌ను నిలబెట్టుకుంటే మహిళలను రజతంతో తళుక్కుమన్నారు. అవినాశ్ సాబ్లె, హర్మిలన్ వెండి వెలుగులు విరజిమ్మారు.**

హాంగ్జౌ: ఆసియాగేమ్స్‌లో భారత్ తమదైన దూకుడు కనబరుస్తున్నది. రోజురోజుకు తమ పతక ఆధిక్యాన్ని అంతకంతకు పెంచుకుంటూ ముందుకెళుతున్నది. పోటీలకు పదకొండో రోజైన బుధవారం భారత్ ఖాతాలో ఏకంగా డజను పతకాలు వచ్చి చేరాయి. మొదటగా ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత స్టార్ ప్లేయర్ వెన్నం జ్యోతి సురేఖ, ఓజాస్ దేవ్‌తలె జోడీ పసిడి పతకాన్ని ముద్దాడింది. ఆసియాగేమ్స్‌లో సురేఖకు ఇది తొలి స్వర్ణం కావడం విశేషం. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో భారత్ 159-158తేడాతో కొరియాపై ఉత్కంఠ విజయం సాధించింది.



**దుమ్మురేపిన రిలే రేసర్లు:**

రిలేలో భారత అథ్లెట్లు దుమ్మురేపారు. పురుషుల 4X400మీ రిలే రేసులో మహమ్మద్ అనాస్, జాకబ్ అమోజ్, మహమ్మద్ అజ్మల్, రమేశ్ రాజేశ్‌తో కూడిన భారత బృందం 3:01:58సెకన్ల టైమింగ్‌తో పసిడి పతకాన్ని తిరిగి దక్కించుకుంది. ఆది నుంచే తమదైన దూకుడు కనబరిచిన ఈ నలుగురు అథ్లెట్లు రిలేలో భారత రికార్డును పదిల పరిచారు. మహిళల రిలే పరుగులో విత్య రామరాజ్, ఐశ్వర్య, ప్రాచి, సుభా వెంకటేశన్‌తో కూడిన జట్టు 3:27:85సెకన్ల టైమింగ్‌తో రజతం సొంతం చేసుకుంది. 35కి.మీల రేస్ వాక్‌లో మంజు రాణి, బాబు రామ్ జోడీ కాంస్యం ముద్దాడింది. మహిళల 800మీ ఫైనల్లో హర్మిలన్ బైన్స్ వెండి పతకం ఖాతాలో వేసుకుంది. పురుషుల 5000మీ ఫైనల్లో అవినాశ్ సాబ్లె రెండో స్థానంతో రజతం సొంతం చేసుకున్నాడు. పోటీలకు 11వ రోజైన బుధవారం భారత్‌కు 3 స్వర్ణాలు సహా ఐదు రజతాలు, నాలుగు కాంస్య పతకాలు లభించాయి.

**జకార్తాను దాటేసి:**

జకార్తా(2018) ఆసియాగేమ్స్ పతక రికార్డు(70)ను భారత్ దిగ్విజయంగా అధిగమించింది. పోటీలకు మరో నాలుగు రోజులు మిగిలున్న ఆసియాగేమ్స్‌లో భారత్ ప్రస్తుతం 81 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది. ఇందులో 18 స్వర్ణాలు, 31 రజతాలు, 32 కాంస్య పతకాలు ఉన్నాయి. ఓవరాల్‌గా ఇన్నేండ్ల ఆసియాగేమ్స్ చరిత్రలో భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం.

**స్క్వాష్ ఫైనల్లో సౌరవ్**

స్క్వాష్‌లో భారత్‌కు కనీసం వెండి పతకం ఖాయమైంది. సౌరవ్ ఘోషాల్ పురుషుల సింగిల్స్‌లో ఫైనల్లో ప్రవేశించాడు. రెండో సీడ్ సౌరవ్ సెమీఫైనల్లో 11-2, 11-1, 11-6 పాయింట్ల భారీ తేడాతో లూయెంగ్ చి హిన్ హెన్రీని 32 నిమిషాల్లోనే చిత్తు చేశాడు.

**పతకాల పట్టిక** (ఆసియా గేమ్స్ 2023)

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 171 | 94 | 51 | 316 |
| 2 | జపాన్ | 37 | 51 | 59 | 147 |
| 3 | కొరియా | 33 | 45 | 70 | 148 |
| 4 | భారత్ | 18 | 31 | 32 | 81 |
| 5 | ఉజ్బెకిస్థాన్ | 16 | 16 | 22 | 54 |

నోట్: దే-దేశం, స్వ-స్వర్ణం, ర- రజతం, కా-కాంస్యం, మొ-మొత్తం




### నీరజ్, కిషోర్ నువ్వానేనా

పురుషుల జావెలిన్ త్రోలో భారత అథ్లెట్లు నీరజ్ చోప్రా, జెనా కిషోర్ కుమార్ హోరాహోరీగా తలపడ్డారు. ఓవైపు భారీ అంచనాల మధ్య నీరజ్ బరిలోకి దిగితే..అసలు పోటీలోనైనా నిలుస్తాడా అనుకున్న కిషోర్‌కుమార్ అదరగొట్టాడు. సాంకేతిక సమస్యల కారణంగా నీరజ్ వేసిన తొలి త్రో వృథా కాగా, కిషోర్‌కుమార్ తన నాలుగో ప్రయత్నంలో 87.54మీటర్ల దూరం విసిరాడు. ఇప్పటికే ప్రతిష్ఠాత్మక టైటిళ్లతో జావెలిన్‌కింగ్‌లా వెలుగొందుతున్న నీరజ్ 88.88మీటర్లతో పసిడి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. ఇలా మన దేశానికే చెందిన ఇద్దరు ప్లేయర్లు స్వర్ణ, రజత పతకాలు దక్కించుకున్నారు.

### 13 ఏళ్ల కల సాకారం

రెజ్లింగ్‌లో ప్రత్యేకమైన గ్రీకో రోమన్ పోటీలో భారత స్టార్ సునీల్ కుమార్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. 87 కిలోల విభాగంలో సునీల్ తన ఉడుం పట్టుతో కాంస్యం దక్కించుకున్నాడు. కిర్గిస్థాన్ రెజ్లర్ అతబెక్ అజిస్బెకోవ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో 2-1తో విజయ ఢంకా మోగించాడు. దాంతో, 13 ఏళ్ల తర్వాత ఈ పోటీలో పతకం గెలిచిన భారత రెజ్లర్‌గా సునీల్ చరిత్ర పుటల్లోకెక్కాడు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.